క్లుప్తంగా

ప్రజా సమస్యలపై 6 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కందుకూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో ప్రజల నుంచి 6 అర్జీలు వచ్చినట్లు మున్సపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. వీటిలో రేషన్‌కార్డు, పింఛన్లు, ఆధార్ సమస్యలు వంటి వ్యక్తిగత సమస్యలతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం వంటి సమస్యలపై ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులను ఆయా విభాగాల వారీగా పంపి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం 9177700267 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు రూరల్: మండలంలోని కొండముడుసుపాలెం ఫీడర్ లైన్‌లో 11కేవీ లైన్‌కు తగిలే చెట్ల కొమ్మలను తొలగించేందుకు మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ నరసింహం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్న మోపాడు, కొండముడుసుపాలెం, అగ్రికల్చర్ వినియోగదారులు, ప్రజలు విద్యుత్‌శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

కనిగిరిరూరల్: విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం మంగళవారం స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో మంగళవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎంవీఎల్ నరసింహ, మాల్యాద్రి పెద్దిరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని కనిగిరి, హెచ్‌ఎంపాడు, పీసీపల్లి, వెలిగండ్ల మండలాల విశ్రాంత ఉద్యోగులంతా హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

వీఆర్‌ఓల సంఘ అధ్యక్షునిగా మాల్యాద్రి

సీఎస్‌పురం(పామూరు): వీఆర్‌ఓల సంఘ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొండాబత్తిన మాల్యాద్రి, పిక్కిలి బాలకాశయ్య నియమితులయ్యారు. సోమవారం జరిగిన నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా కోడూరి విష్ణు, కోశాధికారిగా కొంకాల ఓబులపతి, సంయుక్త కార్యదర్శిగా మాలకొండయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ వీఆర్‌ఓల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అలవెన్స్ పంపిణీ

కనిగిరిరూరల్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవితలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఇంటి వద్ద విద్య, గర్ల్స్ స్టైఫండ్, ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్టు అలవెన్స్‌ను సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. అనంతరం కనిగిరి యూత్ ఆధ్వర్యంలో పిల్లలకు దుప్పట్లు, పెన్సిళ్లు నోట్‌బుక్స్ అందజేశారు. హెచ్‌ఎం జి. సంజీవి ఉపాధ్యాయులు కోటి రత్నం, ఏసు రత్నం, ఖాదర్‌బాష, పద్మజరాణి, స్పెషల్ ఎడ్యుకేటర్ తిరుపతమ్మ భవిత సెంటర్ ఉపాధ్యాయులు ఎస్.సైమన్, గోపాలకృష్ణ, ఫిజియోథెరపిస్టు జి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరెడ్డి అకాల మరణం బాధాకరం

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురంకు చెందిన సీనియర్ నాయకుడు, రెడ్డి సంక్షేమ సంఘ నాయకుడు పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి(72) అకాల మృతి బాధాకరమని కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు అన్నారు. వెంకటేశ్వరరెడ్డి సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కదిరి బాబూరావు మృతుని కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి పరామర్శించి ప్రగాఢసానుభూతి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

నవనీతమ్మకు ఘన నివాళి



కందుకూరు రూరల్: హిందీ ఉపాధ్యాయురాలు నవనీతమ్మ సంస్మరణ సభలో ఆమె సహోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ఆధ్యాత్మిక శిష్యులు సోమవారం ఘన నివాళులర్పించారు. ఎంఈఓ బండి గోవిందయ్య మాట్లాడుతూ నవనీతమ్మ టీచర్ అంటే మాకు ఎంతో అభిమానమన్నారు. హిందీ ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొందానంటే ఆమె వద్ద నేర్చుకున్న పాఠాలేనన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహోధ్యాయులు దండోరా దాసు, అమెరికాలో స్థిరపడిన శిష్యుడు ఇన్నమూరి చక్రపాణి, వైద్యులు తన్నీరు మల్లికార్జున, హిందీ పండిట్ బాలక్రిష్ణ, రెడ్‌క్రాస్ చైర్మన్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఊరూరా మద్యం పరవళ్లు

ఊరూ..వాడ మద్యం పరవళ్లు తొక్కుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకువచ్చిన కొత్త మద్యం పాలసీ అధికార పార్టీకి వరంగా మారింది. టెండర్ దుకాణాలకు అనుబంధంగా గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటై ఏనీటైం మద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి పేదలను దోచేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉదయం ఏడు గంటలకే షాపులు తీస్తున్నా, అధిక ధరలకు మద్యం అమ్ముతున్నా మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులకు అవేమీ కనిపించడం లేదు.

- ప్రతి గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు
- విక్రయదారులంతా అధికారపార్టీ కార్యకర్తలే
- గ్రామాల్లో ఏరులైపారుతున్న మద్యం
- కుటుంబాలు నాశనమవుతున్నాయని మహిళలు ఆవేదన
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు



పొన్నలూరు మండలం బాలిరెడ్డిపాలెంలో బడ్డీ కొట్టులో బెల్ట్‌షాపు నిర్వహణ



టంగటూరులో బెల్ట్‌షాపు పక్కనే బహిరంగంగా మద్యం తాగుతున్న దృశ్యం

పొన్నలూరు: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం గ్రామ పంచాయతీలు 112 ఉన్నాయి. లైసెన్సు మద్యం షాపులు పొన్నలూరులో-2, కొండపిలో-3, సింగరాయకొండలో-6, మర్రిపూడిలో-2, జరుగుమల్లిలో-3, టంగుటూరులో-4 మొత్తం 20 మద్యం షాపులు ఉన్నాయి. ఆయా ప్రాంతాన్ని బట్టి ఒక్కొక్క మద్యం దుకాణంలో ఏడాదికి సరాసరి రూ, 2.50 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతాయి. అన్ని షాపుల్లో సుమారుగా రూ.50 కోట్లకు పైగా వ్యాపారం సాగుతోంది.

గ్రామ గ్రామాన బెల్టు దుకాణాలు...

నియోజకవర్గంలో బెల్టు షాపు లేని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు. 112 గ్రామ పంచాయతీలు ఉండగా వాటి అనుబంధ గ్రామాల్లో సరాసరి రెండు నుంచి మూడు మద్యం బెల్టు షాపులు ఉన్నాయి. లైసెన్స్ షాపుల నుంచి ప్రతి రోజూ వాహనాల ద్వారా మద్యం సీసాలును బెల్టు షాపులకు సరఫరా చేస్తుంటారు. ఈ తతంగమంతా ఆయా మండలాల్లో అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో నడుస్తుంది. బెల్టు షాపుల్లో సరాసరి రోజుకు రూ.6వేలు నుంచి రూ.10 వేల వరకు మద్యం వ్యాపారం జరుగుతుంది. ఇలా నియోజకవర్గంలోని గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా ఏడాదికి సుమారుగా రూ.30 కోట్ల వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా.

అధిక ధరకు విక్రయం...

ప్రస్తుతం చాల మద్యం షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తూ మద్యం ప్రియుల జేబులకు చిల్లుపెడుతున్నారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన సమయం ప్రకారం కాకుండా ఉదయం 8 గంటలకు షాపు తీస్తూ అర్ధరాత్రి వరకు కొనసాగిస్తున్నారు. షాపు సమయం ముగిసిన తరువాత అర్ధరాత్రి అయితే మద్యం సీసాపై రూ.50 నుంచి రూ.70 వరకు అదనంగా తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ తంతుపై అడిగేవారు లేకపోవడంతో షాపుదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రగల్భాలకే పరిమితం...

మద్యం షాపుల్లో వసూలు చేస్తున్న అధిక ధరలను, గ్రామాల్లో బెల్టు షాపులను పూర్తిగా అరికడతామని, బెల్టు షాపు నిర్వహిస్తూ పట్టుబడితే రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగల్భాలు పలికినా క్షేత్ర స్థాయిలో అవేవి అమలు కావడం లేదు. ప్రతి లైసెన్సు షాపు నుంచి నెల నెల వచ్చే మాముళ్లను మొత్తగా నొక్కేస్తూ ఎక్సైజ్ అధికారులు పట్టీ పట్లనట్లు ఉండటంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలుస్తున్నాయి. అప్పుడప్పుడూ బెల్టు షాపులపై దాడులు చేసి పట్టుకుంటున్నా ఇవి నామమాత్రంగా ఉండటంతో యథేచ్ఛగా గొలుసు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇదిఇలా ఉంటే పైకి బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్నా కొన్ని గ్రామాల్లో అధికారపార్టీ నాయకుల నుంచి ముడుపులు తీసుకొని సంబంధిత అధికారులే బెల్టు షాపులు పెట్టిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా గ్రామాల్లో వెలిసిన బెల్టు షాపులతో తమ కాపురాలు నాశనమవుతున్నాయని మహిళలు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో నివాసముంటున్న ఇళ్ల మధ్య విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండటంతో కూలీనాలి చేసుకున్న డబ్బులను మద్యానికి ఖర్చుపెడుతున్నారని పేద మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లోని అనధికార బెల్టు షాపులపై దృష్టిపెట్టి వెంటనే తొలగించాలని ప్రజలు, మహిళలు కోరుతున్నారు.



ముండ్లమూరివారిపాలెంలో బెల్ట్‌షాపుపై దాడి చేసి పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు: ఆరేళ్ల లోపు పిల్లలకు వందశాతం ఆధార్ సేవలు అందించాలనే లక్ష్యంతో మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.అనూష తెలిపారు. ఈ ఆధార్ సేవలు 0 నుంచి 6 ఏళ్ల వయసున్న పిల్లలకు ప్రత్యేకంగా ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ నెలకు సంబంధించి ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు, 26 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఈ నెల 17వ తేదీ బిలాల్‌నగర్ సచివాలయం పరిధిలోని క్రిష్ణ బలిజసంఘం అంగన్‌వాడీ కేంద్రంలో, బూడిదపాలెం సచివాలయం పరిధిలోని దర్గా ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు జరుగుతాయి. అలాగే ఈ నెల 18వ తేదీ గుర్రంవారిపాలెం సచివాలయం పరిధిలోని గుర్రంవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో, ఐఎస్‌రావు నగర్ సచివాలయం పరిధిలోని సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతాయి. అలాగే 19వ తేదీ కోటారెడ్డినగర్-1 సచివాలయం పరిధిలోని ఆదియేంద్రకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో, కోటారెడ్డినగర్ సచివాలయం-2 పరిధిలోని బూడిదపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతాయి. 20వ తేదీ కోటువారిస్ట్రీట్ సచివాలయం పరిధిలోని యానాదిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో, సంతోష్‌నగర్ సచివాలయం పరిధిలోని కోటకట్టవీధి అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతాయి. ఇక ఈ నెల 26వ తేదీ శ్రీరామకాలనీ సచివాలయం పరిధిలోని ఖాజీపాలెం అంగన్‌వాడీ కేంద్రం, తూర్పువడ్డిపాలెం సచివాలయం పరిధిలోని కమ్మపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ శిబిరాలు జరుగుతాయి. ఈనెల 27వ తేదీ జనార్దనకాలనీ సచివాలయం పరిధిలోని జనార్దనకాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రం, ఉప్పుచెరువు సచివాలయం పరిధిలోని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అంగన్‌వాడీ కేంద్రంలో, ఈ నెల 28వ తేదీ నల్లమల్లివారితోట సచివాలయం పరిధిలోని బృందావనం అంగన్‌వాడీ కేంద్రం, యర్రవడ్డిపాలెం సచివాలయం పరిధిలోని పడమటివడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ శిబిరాలు జరుగుతాయని వివరించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



ఆనికాలపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి



వీరరాంపురంలో అర్జీలు అందజేస్తున్న రైతులు

సీఎస్‌పురం(పామూరు): రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి తెలిపారు. మండలంలోని ఆనికాలపల్లెలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ పొలాలు ఆన్‌లైన్ కాకున్నా, తప్పుల సవరణలు ఉన్నా పరిష్కారానికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రెవెన్యూ సదస్సుకు ఆన్‌లైన్, సర్వేకోసం మొత్తం 7 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వీరరాంపురంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలని 6, రోడ్డు నిర్మాణానికి ఒకటి, వ్యవసాయ భూమి కోసం ఒకటి, తప్పుల సవరణకు అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్వో ఎస్ కాశయ్య, జేమ్స్, బెంజి, ఈఓ శంకర్, సర్పంచ్ ఆలా శాంతకుమారి పాల్గొన్నారు.

రాళ్లపాడు రైతులను ఆదుకోవాలి

- కుడికాల్వ గేటు మరమ్మతులు పూర్తి చేసి వీలైనంత త్వరగా నీటి విడుదల చేయాలి
- ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే రైతులకు ఇబ్బందులు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్



బుర్రా మధుసూదన్ యాదవ్

కందుకూరు: రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాల్వ గేటు మరమ్మతులు పూర్తి చేయడంలో ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితులు వచ్చాయని, మరమ్మతులు వెంటనే పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇచ్చి ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్ సోమవారం డిమాండ్ చేశారు. రాళ్లపాడు ప్రాజెక్టు నిర్వహణలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీరు ఉండి పంటలు పండే అవకాశం ఉన్నా రైతులను ఇబ్బందులు పెట్టడం సరైందికాదన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని పరిధిలో ఆయకట్టు రైతులు ముమ్మరంగా వరినార్లు సాగు చేసి ఉన్నారని వీలైనంత త్వరగా నీటిని విడుదల చేయకపోతే వరినార్లు ఎండిపోతాయన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 20 అడుగుల నీరు ఉన్నా సాగుకు నీరు ఇస్తారో లేదో అనే ఆందోళన రైతుల్లో నెలకొందన్నారు. ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేయడం వల్లే ఇటువంటి పరిస్థితి వచ్చిందని, వారం రోజుల నుంచి నీటి కోసం రైతులు ప్రాజెక్టు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వానికి మాత్రం పట్టడం లేదన్నారు. దీన్ని బట్టి రైతుల పట్ల ప్రభుత్వానికి ఎటువంటి శ్రద్ధ ఉందో అర్థం అవుతుందన్నారు. తుఫాన్ వల్ల విస్తారంగా వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి నీరు వస్తుంటే గేట్ల నిర్వహణను ముందుగా తనిఖీ చేసుకోవాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. కుడి కాల్వ గేటు ఊడి కింద పడిపోవడం దారుణంగా ఉందన్నారు. దీని వల్ల రైతులకు నీరు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం, అధికారులు అత్యవసర ప్రాతిపదికను నిపుణులను పిలిపించి మరమ్మతులు చేయించాల్సి ఉన్నా ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించిన గేటు మరమ్మతులు పూర్తి చేయాలని, లేకుంటే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రైతులకు తక్షణం నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతుల పక్షాల భారీ ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఘనంగా ఆలయ వార్షిక వేడుకలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలోని రేణిమడుగులో అంకాల పరమేశ్వరీదేవి ఆలయ మూడో వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరి అమ్మవారు, లక్ష్మీదేవి, సరస్వతీదేవిల విగ్రహమూర్తులకు అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

పంచాయతీల సుస్థిర అభివృద్ధే లక్ష్యం



శిక్షణలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): పంచాయతీల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పనిచేయాలని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో సోమవారం గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ నిర్వహించారు. సుస్థిర లక్ష్యాలు వివరించి సాధనకు అవలంబించాల్సిన విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ జె.ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. స్థానక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ ఏ విధంగా రూపొందించాలో అవగాహన కలిస్తామన్నారు. ఎంపీపీ బెల్లం నిర్మలాదేవి, ఈఓఆర్‌డీ ఏడుకొండలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి పూజా సామగ్రి సమర్పణ

పామూరు: స్థానిక వాసవీమాత ఆలయానికి దాతలు వెండి పూజాసామగ్రి అందజేయడం అభినందనీయమని ఆలయ చైర్మన్ ఏల్చూరి బాలకొండలరావు అన్నారు. వాసవీమాత ఆలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అమ్మవారి పూజా కైంకర్యాలలో వినియోగించే వెండి సామగ్రిని ఆలయ ఉపాధ్యక్షుడు కారంశెట్టి నారాయణ దంపతులు చైర్మన్ కొండలరావుకు అందజేశారు. అదేవిధంగా వెండి వాకిలి ఏర్పాటుకు ముడి వెండి వస్తువులను అందజేశారు.

మొక్కలు విరివిగా నాటాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, సిబ్బంది

కొండపి: మండలంలోని కె.ఉప్పలపాడులో ఐటీసీ ఎంఎస్‌కె సెర్ప్ ఎన్జీఓ సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఐటీసీ అధికారి హరిణి మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాలు వివరించారు. ఐటీసీ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యకు మొక్కలు పెంచడమే మార్గమన్నారు. ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చరణ్ కుమార్ రెడ్డి, సిద్ధార్థ, నాగరాజు, ధనుంజయ్ మాజీ ఎమ్మెల్యే అచ్యుత్ కుమార్, డాకా పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ వృథాను అరికట్టాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది

కందుకూరు: విద్యుత్ వృథాను అరికడితే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎం నాగేశ్వరరావు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం నుంచి ఏరియా హాస్పిటల్ పామూరు రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్‌ను ఆదా చేయడం వల్ల ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రతి కుటుంబ విద్యుత్ పొదుపు చేసే అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద భారీ సబ్సిడీలతో సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. డివిజన్‌లోని పలువురు విద్యుత్‌శాఖ ఇంజనీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు ఉపాధ్యాయ రత్న



అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లు

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె. వెంకటేశ్వర్లుకు ఉపాధ్యాయరత్న అవార్డును హైదరాబాద్‌కు చెందిన ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ బహూకరించింది. హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ చంద్రయ్య మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు అవార్డు గ్రహీత వెంకటేశ్వర్లు తెలియచేశారు. విద్యారంగంలో వినూత్న రీతిలో పాఠాలు బోధిస్తూ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేసినందుకు అవార్డు దక్కినట్లు తెలిపారు. ఎంఈఓలు శివనాగేశ్వరరావు, రమణయ్య అభినందించారు.

ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించాలి

కందుకూరు:

రాళ్లపాడు ప్రాజెక్టు కింద వరినార్లు ఎండిపోకుండా చర్యలు తీసుకొని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం గుడ్లూరు, కందుకూరు, ఉలవపాడు ఏరియా కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఏ గౌస్, జీవీబీ కుమార్ డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో 20అడుగుల నీరు ఉన్నప్పటికి ప్రాజెక్టులోకి చుక్కనీరు రానికారణంగా నార్లు ఎండిపోతున్నాయని, పైర్లు వేసుకునే అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల క్రితం గేటు విరిగిపోయిన కారణంగా కుడికాల్వ పరిధిలో నీరు లేక రైతులు పంటలు వేయలేని దుస్థితి నెలకొందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందని, గేటు మరమ్మతులు సకాలంలో చేయించుకోవాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉందన్నారు. పంటలు సాగు చేసుకునే సమయంలో ఇలాంటి సంఘటన జరిగిందంటే రైతుల పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అధికారులు స్పందించి రాష్ట్రంలోని నిపుణులను పిలిపించి గేటు పైకి ఎత్తేందుకు చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని రైతులకు అందించాలని కోరారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.23 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,23,032 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.53,450, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.18,820, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.48,242, మహాప్రాకార నిర్మాణానికి రూ.2,520 వచ్చినట్లు ఈఓ తెలిపారు. శాశ్వత అన్నదానానికి హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన వీరంరెడ్డి రత్నారెడ్డి లక్ష్మీనారాయణమ్మ దంపతులు రూ.10,116 వేల విరాళం అందజేశారన్నారు.